సాక్షి వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం, 23, జూన్, 2023



ఘరానా మోసగాడు అరెస్టు

చీటీల వ్యాపారం చేసి ప్రజలకు శఠగోపం పెట్టిన ఘరానా మోసగాడిని పోరుమామిళ్ల పోలీసులు అరెస్టు చేశారు. -8లో



పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఇటీవలన మరణించిన పోలీసు కుటుంబాలకు ఎస్పీ అన్బురాజన్ ఆర్థికసాయం చెక్కులు అందజేశారు. -8లో



శ్రీవరదరాజస్వామి భూముల వేలంపాటలో ఉద్రిక్తత

ముద్దనూరు మండలం పెద్ద దుద్యాలలోని శ్రీవరదరాజస్వామి దేవస్థానం భూముల వేలంపాట ఉద్రిక్తంగా మారింది. -8లో

న్యూస్‌రీల్

25న జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఈనెల 25వ తేదీ ఆదివారం జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్ తెలిపారు. అండర్-14, అండర్-16 విభాగాల్లో నిర్వహించే ఎంపికలకు ఆసక్తి గల క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఫొటోలు, కిట్లు వెంట తీసుకుని హాజరుకావాలని సూచించారు. అండర్-14 విభాగం క్రీడాకారులకు 01-09-2009, అండర్-16 విభాగానికి 01-09-2007 కటాఫ్ డేట్‌గా పేర్కొన్నారు.

ప్రశాంతంగా సర్టిఫికెట్ల పరిశీలన



డీఈఓ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కేజీబీవీల్లో పోస్టుల భర్తీ కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన కడప డీఈఓ కార్యాలయంలో ప్రశాంతంగా ముగిసింది. 29 కేజీబీవీలకు సంబంధించి 132 పోస్టుల భర్తీకిగాను 1:3 చొప్పున 375 మంది సర్టిఫికెట్ల పరిశీలన బుధ, గురువారాలు జరిగాయి. ఈ సందర్భంగా డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ కేజీబీవీల్లోని ఖాళీ పోస్టుల భర్తీ లో దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. మెరిట్, రోస్టర్ ప్రాతిపదికన నియామకాలు జరుగుతాయన్నారు.

ముందస్తు రిజర్వేషన్లపై ఆర్టీసీ రాయితీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ దూర ప్రాంత సర్వీసుల్లో రాను, పోను టిక్కెట్ ముందుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణీ టిక్కెట్ ఛార్జీలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా లేదా కడపలోని ఆర్టీసీ బస్టాండు రిజర్వేషన్ కౌంటర్‌లో కూడా రాను, పోను టిక్కెట్ రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

ముగిసిన 'మెడికల్-హెల్త్' ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేపడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాధారణ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. చివరి రోజున ఆఫీస్ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లకు బదిలీలు చేపట్టారు. బదిలీల ప్రక్రియలో రాయలసీమ వ్యాప్తంగా పనిచేస్తున్న దాదాపు 650 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగుల సర్వీసు సీనియారిటీ.. ఇతర ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టామని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సల, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్స్ అల్తావుల్లా, ఆంజనేయులు పాల్గొన్నారు.

చిలంకూరుకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు



కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నిర్మల్‌కుమార్ తదితరులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. గురువారం తిరుపతి నుంచి డిప్లమో ఆర్‌డీ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో కడప, జమ్మలమడుగు, నంద్యాల డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ బృందం చిలంకూరులో స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి కృషితో పాలిటెక్నిక్ కళాశాల మంజూరైందని గ్రామ నాయకులు రఘునందన్‌రెడ్డి, రామకృష్ణయ్య తెలిపారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సీఎం ను కలిసి అభ్యర్థించామన్నారు. సీఎం ఆదేశాల మేరకు చిలంకూరుకు ప్రత్యేక బృందం వచ్చింది.

సంక్షేమ రక్ష.. జగనన్న సురక్ష





- అర్హత ఉండీ పథకాలు అందని వారి గుర్తింపు
- జులై 1 నుంచి ఆగస్టు 1 వరకు సర్టిఫికెట్ల జారీ
- నేటి నుంచి ఇంటింటికీ వలంటీర్లు

జిల్లా జనాభా:	20.61 లక్షలు
కుటుంబాలు :	5.06 లక్షలు
మొత్తం సచివాలయాలు :	649
జగనన్న సురక్ష కార్యక్రమంలో జారీ చేయనున్న పత్రాలు:	9

కడప సెవెన్‌రోడ్స్ : సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నవరత్నాల కింద రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా దీవెన, ఆసరా తదితర పథకాలు అమలు చేస్తోంది. కుల,మత, ప్రాంత, రాజకీయాలతో నిమిత్తం లేకుండా అర్హులకు లబ్ధి చేకూరుస్తోంది. జిల్లాలో 90 శాతం కుటుంబాలు ఏదో ఒక ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయి. ఈ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాలో ఇప్పటికి 7197.48 కోట్ల రూపాయలు ప్రభుత్వం అందించింది. అర్హత కలిగి సంక్షేమ పథకాలు పొందని వారంటూ ఉండరాదని ప్రభుత్వం భావిస్తోంది. అలాంటి వారిని గుర్తించి పథకాలు అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం అవసరమైన సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్లు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారు. జులై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేటి నుంచి ఇంటింటికి వలంటీర్లు

2011 జనాభా లెక్కల ప్రకారం వైఎస్సార్ జిల్లాలో 20.61 లక్షల మంది ఉన్నారు. కుటుంబాలు 5.06 లక్షలు ఉన్నాయి. జిల్లాలోని 423 గ్రామ సచివాలయాలు, 226 వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఈనెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటింటికి వెళతారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అనే విషయం తెలుసుకుంటారు. ఒకవేళ ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే వారి పేర్లు నమోదు చేసుకుంటారు. వారికి ఏ పథకం అవసరమో, అందుకు ఏయే ధ్రువీకరణపత్రాలు అవసరమో గుర్తిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, సేవల గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జులై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు అధికారులు క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

జారీ చేయనున్న ధ్రువీకరణ పత్రాలు

ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు అనుసంధానం, కౌలు రైతులకు సంబంధించిన క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు (సీసీఆర్‌సీ)లను సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల ద్వారా అధికారులు ఎలాంటి సేవా రుసుములు వసూలు చేయకుండా ప్రజలకు ఉచితంగా అందజేస్తారు.

అధికార బృందాల ఏర్పాటు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయాల వద్ద ఏర్పాటు చేయనున్న క్యాంపుల నిర్వహణకు అవసరమైన అధికార బృందాలను ఏర్పాటు చేయనున్నారు. మండల స్థాయిలో రెండు బృందాలను నియమిస్తారు. ఒక బృందంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్,ఇతర అధికారులు ఉంటారు. మరో బృందంలో తహసీల్దార్, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ, తదితరులు ఉంటారు. ఏదైనా మండలంలో గ్రామ సచివాలయాలు 24కు మించి ఉంటే మండల స్థాయి అధికారి ఆధ్వర్యంలో అదనంగా మరో బృందాన్ని ఏర్పాటు చేస్తారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ క్యాంపుల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డివిజనల్ స్థాయి అధికారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో మూడు బృందాలు ఏర్పాటు చేస్తారు. మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, ఇతర సిబ్బంది ఒక బృందంగా ఉంటారు. కాగా జోనల్ కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్, ఇతర సిబ్బంది మరో బృందంగా ఉంటారు. క్యాంపుల్లో ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను డిజిటల్ అసిస్టెంట్ ద్వారా డేటా ఎంట్రీ చేయిస్తారు. తర్వాత 15 నుంచి 30 రోజుల్లోపు ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

57 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23వ తేదీ శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా పరిధిలో 57 పరీక్షా కేంద్రాల్లో 42,300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 2వ, 4వ, 5వ సెమిస్టర్‌ల విద్యార్థులు, 6వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్స్) విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈనెల 23 నుంచి జూలై 20వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు వైవీయూ అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు..

వైవీయూ పరిధిలోని 57 పరీక్షా కేంద్రాల్లో 14 పరీక్షా కేంద్రాలు సెల్ఫ్‌సెంటర్‌లుగా ఏర్పాటయ్యాయి. అయితే స్వీయ కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ నిరోధించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వైవీయూ అధికారులు సంబంధిత కళాశాలల యాజమాన్యాలను కోరారు. దీంతో స్వీయ పరీక్షాకేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు బాగా వెలుతురు వచ్చేలా చర్యలు చేపట్టడంతో పాటు తాగునీరు అందుబాటులో ఉంచడం, టాయిలెట్లను శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని కళాశాలల యాజమాన్యాలను వైవీయూ అధికారులు కోరారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు కళాశాలల ఐడెంటిటీ కార్డును వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు.

పరిశీలకులు, స్క్వాడ్ బృందాలు ఏర్పాటు..

పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రతి కేంద్రానికి ఒక పరిశీలకున్ని నియమించారు. మొత్తం 57 పరీక్షా కేంద్రాల్లో 57 గురు అబ్జర్వర్లను, వీరితో పాటు ఒక్కో బృందంలో ఇద్దరు సభ్యులు గల 5 స్క్వాడ్ బృందాలను వివిధ రూట్లలో పరీక్షల తనిఖీ కోసం నియమించారు.

మూడు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహణ

ప్రధాన పరీక్షలన్నీ ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. అయితే తొలుత నిర్వహించే క్లస్టర్ పరీక్షలు ప్రతిరోజూ మూడు దశల్లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు మరో బ్యాచ్, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఇంకో బ్యాచ్ చొప్పున మూడుదశలుగా పరీక్షలు నిర్వహించనున్నారు.

సమస్య తలెత్తితే పరీక్షల విభాగాన్ని సంప్రదించవచ్చు



పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రంలో ఏవైనా సమస్య తలెత్తితే ఆయా పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ద్వారా యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని సంప్రదిస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తాం.

– ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి, వైవీయూ

1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు స్థానాల కేటాయింపు



స్థానాల కేటాయింపు కార్యక్రమానికి హాజరైన 2008,1998 మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులు



అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి, అధికారులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 1998, 2008 అభ్యర్థులకు మినిమం టైమ్ స్కేల్ కింద ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. ఇటీవల అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో పలు పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఈ స్థానాలకు 1998, 2008 అభ్యర్థుల కేటాయింపునకు సంబంధించి గురువారం కడప డీఈఓ కార్యాలయంలో స్థానాలు కేటాయించారు. ఇందులో 1998 అభ్యర్థులు 2008 వారి కంటే ముందు మాకు స్థానాలను కేటాయించాలని, అన్ని ఖాళీలను చూపించాలని కోరారు. కానీ ఉద్యోగ భర్తీ విషయంలో 1998 వాళ్లకంటే ముందు 2008 అభ్యర్థులకు మినిమం టైమ్ స్కేల్ కింద ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చింది. వారు ముందుగా ఉద్యోగాల్లో చేరిపోయారు. 1998 వాళ్లకంటే ముందు 2008 వారికి కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారమే డీఈఓ రాఘవరెడ్డి స్థానాల కేటాయించారు. కానీ 1998 అభ్యర్థులకు ఉద్యోగం ఆలస్యంగా వచ్చినా సీనియారిటీలో మాకు ముందు స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకు డీఈఓ ఒప్పుకోక పోవడంతో కౌన్సెలింగ్ ఆపాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ విషయమై డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2008 అభ్యర్థుల ఉద్యోగ సర్వీస్ ముందు కాబట్టి వారికి స్థానాలను కేటాయించి తర్వాత 1998 అభ్యర్థులకు కేటాయించామన్నారు.

నైపుణ్యం పెంపొందించేలా విద్యావిధానం

- యోగివేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, చిత్రంలో డీన్‌లు ఆచార్య ఏజీ దాము, ఆచార్య వై. సుబ్బరాయుడు

వైవీయూ: ప్రస్తుత పోటీప్రపంచంలో సమాజ, సంస్థల అవసరాలను అనుసరించి విద్యార్థుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేలా జాతీయ విద్యావిధానం ఉందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. గురువారం వైవీయూలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం అమలుపై అనేక రాష్ట్రాలు నేటికీ తర్జనభర్జన పడుతున్నాయని, ఎన్ఈపీ-2020ని అమలు చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్గదర్శనంలో ఏపీ ఉన్నత విద్యా మండలి ఉన్నతవిద్యలో పలు సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. ఇందులో భాగంగా తాజాగా ఈ ఏడాది నుంచి ప్రారంభించనున్న సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంతో విద్యార్థులకు మేలు చేకూరనుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 159 సబ్జెక్టులు మేజర్ సబ్జెక్టులుగా కోర్సులు నిర్వహించనున్న నేపథ్యంలో వైవీయూ పరిధిలో 37 సబ్జెక్టులు మేజర్ సబ్జెక్టులుగా ప్రారంభిస్తున్నామని, 94 మైనర్ సబ్జెక్టులను విద్యార్థులు ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టు కోర్సును అభ్యసించడం ద్వారా ఆ కోర్సులో పూర్తిస్థాయి నైపుణ్యం సాధ్యమవుతుందన్నారు. అదే విధంగా ఇంటర్ అర్హతతో డిగ్రీలో ప్రవేశం పొందే విద్యార్థి తొలి ఏడాది కోర్సును పూర్తి చేసుకుంటే సర్టిఫికెట్ కోర్సుగాను, రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంటే డిప్లొమాగాను, మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుంటే డిగ్రీగాను, 4 సంవత్సరాలు పూర్తి చేసుకుంటే హానర్స్ డిగ్రీగాను, అనంతరం నాలుగు సంవత్సరాల హానర్స్ డిగ్రీతో పాటు (పీహెచ్‌డీ) పరిశోధనల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. ఒకవేళ కోర్సు మధ్యలోనే ఆపివేసి వెళ్లదలచుకుంటే అప్పటి వరకు పూర్తిచేసిన కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను అందజేస్తారని తెలిపారు. కోర్సుతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు సాధించేలా స్కిల్‌డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వైవీయూ అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏజీ దాము మాట్లాడుతూ యూజీ హానర్స్ డిగ్రీతో పాటు పరిశోధనలో ప్రవేశం కల్పించదలచిన కళాశాలలకు ఉన్నతవిద్యా మండలి పలు మార్గదర్శకాలను నిర్దేశించిందన్నారు. కనీసం ఏటా 30 శాతం ప్రవేశాలు పొందడంతో పాటు పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకులు ఉండాలని సూచించారు. యూజీ హానర్స్ డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు పీహెచ్‌డీకి అర్హులవుతారని పేర్కొన్నారు. దీంతో పాటు 10 నెలల పాటు ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలు అందుతాయన్నారు. సీడీసీ డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు మాట్లాడారు.

రైలు బండి.. ముందుకు నడపండి!

- కడపను వదలని నంద్యాల డెమో
- రేణిగుంట వరకు పొడిగించాలని ప్రతిపాదన
- ఇంతవరకు అమలుకు నోచుకోని వైనం
- కడపలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథాగా ఉంటున్న రైలు
- డెమో పొడిగింపుతో నంద్యాల, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులకు ప్రయోజనం



ఉదయం నుంచి సాయంత్ర వరకు కడప రైల్వేస్టేషన్‌లో వృథాగా స్టేబుల్ అయిన నంద్యాల-కడప డెమో రైలు

రాజంపేట: నంద్యాల-కడప మధ్య నడిచే డెమో ప్యాసింజర్ రైలు కడపను వదలడంలేదు. 77401/77402 నెంబరుతో నడుస్తున్న డెమోను పొడిగించాలనే ప్రతిపాదన రైల్వేశాఖ చేసింది. అయితే ఆ ప్రతిపాదనను ఆ శాఖ ఇప్పటి వరకు అమలు చేయడంలేదు. నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు తిరుపతి వైపు వెళ్లేందుకు అనువుగా ఉంటుందనే డెమోను రేణిగుంట వరకు పొడిగించే ప్రతిపాదనను తీసుకొచ్చారు.

తిరుపతి వరకు పొడిగించాలని డిమాండ్

నంద్యాల- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్లేందుకు అనువుగా ఈ డెమో ప్యాసింజర్ రైలు ప్రయోజనకరమని భక్తులు భావిస్తున్నారు. అయితే ఈ రైలును రేణిగుంట వరకే ప్రతిపాదించారు. కానీ భక్తులతో పాటు నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు విధుల నిర్వహణ నిమిత్తం తిరుపతికి వెళ్లేవారు అధికంగా ఉన్నారు. ఈరైలును తిరుపతి వరకు పొడిగిస్తే పల్లె ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు సూచిస్తున్నారు.

ఉదయంపూట తిరుపతికి రైలేదీ..

నంద్యాలతోపాటు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలకు చెందిన యాత్రికులు నేరుగా తిరుపతికి వెళ్లేందుకు వీలుగా డెమో నడపాలని పలువురు కోరుతున్నారు. ఈ మార్గంలో వెంకటాద్రి, రాయలసీమ, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి. కానీ ప్యాసింజర్ రైలు ఒకటి కూడా లేకపోవడం విచారకరం. గతంలో స్టీమ్‌ఇంజిన్ లోకోలతో రైళ్లు నడిచే కాలంలోనే కడప నుంచి తిరుపతికి ప్యాసింజర్(93,,94)నెంబర్లతో ఉదయం పూట నడిచేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథా

నంద్యాల-కడప డెమో ప్యాసింజర్ ఉదయం నుంచి సాయంత్రం వరకు వృథాగానే నిలిచిపోతోంది. నంద్యాల నుంచి వచ్చిన డెమోను కడప రైల్వేస్టేషన్ లూప్‌లైనులో స్టేబుల్ చేస్తారు. ఉదయం 9.40 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఖాళీగా డెమో రైలు ఉండటం వల్ల పరోక్షంగా రైల్వేకి ఆదాయం కోల్పోయినట్లేనని రైల్వే వర్గాలు అంటున్నాయి.

పొడిగింపు టైమింగ్స్ ఇలా..

నంద్యాల-కడప డెమో ప్యాసింజర్ రైలును పొడిగింపు చేసే టైమింగ్స్ ఇలా ఉంటాయని రైల్వేశాఖ గతంలో ప్రతిపాదనలో తెలియజేసింది. నంద్యాలలో ఉదయం 5.50కు బయలుదేరి కడపకు 9.40కి చేరుకుంటుంది. 9.45కు కడపలో బయలుదేరి రేణిగుంటకు 1.30 గంటలకు చేరుకుంటుంది. రేణిగుంటలో తిరిగి 2.30కు బయలుదేరి కడపకు 5.30 గంటలకు చేరుకుంటుంది. నంద్యాలకు 9.30కు డెమో చేరుకునేలా సమయం నిర్ణయించారు. స్టాపింగ్ స్టేషన్‌లలో ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట , ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు బాలపల్లెలు ఉన్నాయి.

ఉదయంపూట తిరుపతికి ఒక్క ప్యాసింజర్ రైలులేదు



జిల్లా మీదుగా ఉదయం పూట తిరుపతికి వెళ్లేందుకు ఒక ప్యాసింజర్ రైలు లేదు. తెల్లవారుజామున వెంకటాద్రి, రాయలసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు చాలా స్టేషన్లలో స్టాపింగ్స్‌లేవు. పల్లెప్రాంతాల వాసులు తిరుపతికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నంద్యాల-డెమో ప్యాసింజర్ రైలును రేణిగుంట వరకు పొడిగిస్తామని ప్రతిపాదన ఉంది. ఇంతవరకు అమలు చేయలేదు. రేణిగుంట కాకుండా తిరుపతి వరకు పొడిగిస్తే అందరికి ప్రయోజనకరం. –జంబు రవికుమార్, రిటైర్డ్ పీఆర్ ఉద్యోగి, అరవపల్లె, నందలూరు

పొడిగింపుపై రైల్వేశాఖ నిర్లక్ష్యం



నంద్యాల-కడప మధ్య నడిచే డెమో ప్యాసింజర్ పొడిగింపుపై రైల్వేశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. రేణిగుంట వరకు ఈరైలు పొడిగింపు ప్రతిపాదన చేసినా ఇంతవరకు అమలు చేయడం లేదు. ఉదయం పూట తిరుపతి కి వెళ్లేందుకు ప్యాసింజర్ రైలు లేకపోవడం విచారకరం. డెమోను అయినా రేణిగుంటకు కాకుండా తిరుపతి వరకు నడిపిస్తే ఎందరో ప్రయాణికులకు ప్రయోజనకరం. ఆ దిశగా రైల్వేశాఖ ఆలోచించాలి. –సయ్యద్‌అమీర్, జిల్లా కార్యదర్శి, జిల్లా వక్ఫ్‌బోర్డు

నంద్యాల డెమోను తిరుపతి వరకు పొడిగించాలి



నంద్యాల-కడప డెమో రైలును తిరుపతి వరకు పొడిగించాలి. రేణిగుంట వరకు పొడిగించే ప్రతిపాదన ఉందని చెబుతున్నారు. అమలుచేయలేదు. అయితే నంద్యాల నుంచి తిరుపతికి వెళ్లాలంటే యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల నంద్యాల ప్రాంతంలోని వాసులకు ఉదయం పూట ప్యాసింజర్ రైలు అందుబాటులోకి తీసుకురావాలి. పల్లె ప్రయాణికులకు ఎంతగానో దోహదపడుతుంది. –చెన్నకేశవ, వ్యాపారి, నంద్యాల

నేటి నుంచి ఐసీఎస్ఎస్ఆర్ జాతీయ సదస్సు

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల జాతీయ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలి పారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో మహిళల అభివృద్ధి- సవాళ్లు అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. శుక్రవారం కడప యోగివేమన యూనివర్సిటీకి చెందిన తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ వినోదిని కీలకోపన్యాసం చేస్తారన్నారు. శనివారం యోగివేమన యూనివర్సిటీ తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి.బాబులు ప్రసంగిస్తారని తెలిపారు.

69 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు



కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని 69 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. ఈసీ, మార్కెట్ విలువ, ఈకేవైసీ, రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌తోపాటు మ్యూటేషన్, సబ్ డివిజన్, ఎల్‌పీ నంబరు, ల్యాండ్ కన్వర్షన్ తదితర సేవలు పొందవచ్చు. గతంలో ఆయా సేవల కోసం ప్రజలు సమీపంలోని మండలాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల్లోనే వీటిని అందించనున్నారు.

క్లుప్తంగా

రిమ్స్ మార్చురీలో వృద్ధురాలి మృతదేహం



కడప అర్బన్ : కడప నగరంలోని మేరీనగర్‌కు చెందిన సాలమ్మ (65) అనే వృద్ధురాలిని మే 13న కడప రిమ్స్‌లో చికిత్సకోసం చేర్పించారు. గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. ఆమెను రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చేర్పించారని, ఆమె బంధువులు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

వేముల : మండలంలోని గొందిపల్లెలో గురువారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో రమణయ్య అనే వ్యక్తికి గాయాలయ్యాయి. రమణయ్య ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు మారుస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌గురై గాయపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిడుగుపాటుకు జీవాలు మృతి



పెద్దముడియం : మండలంలోని కొండసుంకేసుల గ్రామంలో బుధవారం రాత్రి పిడుగుపాటుకు గురై 9 జీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన జ్యోతుల వెంకటపతి అనే వ్యక్తి జీవాలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి గ్రామంలో గాలివానతో కూడిన వర్షం కురిసింది. జీవాలకు సమీపంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి జీవాలు మృతిచెందాయని బాధితుడు తెలిపాడు.

ఆరుగురు గురుకుల విద్యార్థులకు అస్వస్థత

కొండాపురం : మండల పరిధిలోని చౌటిపల్లె పునరావాస కేంద్రంలోని డాక్టర్. బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. ఇంటి నుంచి తెచ్చుకున్న తినుబండారాలు తినడంతో వారు అస్వస్థతకు గురైనట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. వెంటనే ఆ పిల్లలను కొండాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. కడుపునొప్పి, విరేచనాలతో ఇబ్బంది పడినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఫుడ్ పాయిజన్ వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

శ్రీవరదరాజస్వామి భూముల వేలంపాటలో ఉద్రిక్తత

- ఆత్మహత్యకు యత్నించిన మహిళలు
- భారీ బందోబస్తు మధ్య వేలంపాట



వేలంపాటలో సీఐ, ఎస్ఐలతో వాదిస్తున్న గ్రామస్తులు

ముద్దనూరు : సుమారు దశాబ్ద కాలంగా వేలంపాటకు నోచుకోని దేవాదాయ భూముల వేలంపాట ఉద్రిక్తంగా మారింది. మండలంలోని పెద్ద దుద్యాల గ్రామంలోని శ్రీవరదరాజస్వామి దేవస్థానం భూముల వేలంపాట గురువారం రసాభాసగా మారింది. 2014లో దేవాదాయ శాఖలో విలీనం చేసినప్పటి నుంచి ప్రప్రథమంగా వేలం పాటను నిర్వహించారు. సుమారు 170 ఎకరాల భూములకు చెందిన వేలంపాటలో మొదట ఇతర గ్రామాలకు చెందిన భూముల వేలంపాట సజావుగానే సాగింది. అయితే పెద్ద దుద్యాల గ్రామానికి చెందిన భూములు వేలం పాట ఆరంభించగానే వివాదం నెలకొని కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పెద్ద దుద్యాల గ్రామానికి చెందిన సుమారు 130 ఎకరాల దేవస్థానం భూముల వేలం పాటను నిలిపివేయాలని ఒక వర్గం వారు నినాదాలు చేసారు. ప్రభుత్వ నిబంధనల మేరకే భూముల వేలం పాట నిర్వహిస్తున్నామని, వేలం పాటలో ఎవరైనా పాల్గొనవచ్చని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. వేలం పాట నిర్వహిస్తే ఆత్మహత్య చేసుకుంటామని ఒకరిద్దరు మహిళలు వేలం పాటకు అడ్డుపడ్డారు. దీంతో ఆలయ సమీపంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. బందోబస్తులో వున్న పోలీసులు ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్న వారిని నివారించారు. వేలంపాట యధాతథంగా నిర్వహిస్తామని దేవాదాయశాఖ ఈవో రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో పరిసర మండలాల నుంచి పోలీసులను రప్పించి భారీ బందోబస్తు మధ్య సీఐ నరేష్ వేలంపాటను అధికారులు పూర్తిచేసారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 3 సంవత్సరాల కాల పరిమితికి వేలం పాటను నిర్వహించామన్నారు. ఒక సంవత్సరానికి గాను రూ.3,05, 500 లక్షలకు వేలం పాటలో భూములను దక్కించుకున్నారని ఈవో తెలిపారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు

పీడీ యదుభూషన్‌రెడ్డి

ఖాజీపేట : ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై చర్యలు తీసుకోవాలని పీడీ యదుభూషన్‌రెడ్డి ఆదేశించారు. ఖాజీపేట మండలంలోని 13 పంచాయితీల్లో రూ.16 వేలు అవకతవకలను సిబ్బంది గుర్తించారు. ఈ మొత్తంను రికవరీ చేయాలని పీడీ సూచించారు. అలాగే గృహ నిర్మాణంలో కేవలం బేస్‌మట్టం వరకూ పూర్తి చేసిన ఇళ్లకు మొత్తం బిల్లు చెల్లింపుపై పీడీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అందుకు కారణం అయిన చెమ్ముళ్ళపల్లె సుబ్బరాయుడు, పుల్లూరు జయరాజులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మండలంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందం గ్రామాలకు వెళ్లి తనిఖీ చేశారు. గురువారం ఓపెన్‌ఫోరం నిర్వహించారు. ఈ సభలో తనిఖీల్లో పరిశీలించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీడీ యదుభూషన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా వలసలను నివారించామన్నారు. ప్రతి కూలీకి కనీస కూలీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అందరికీ వంద పనిదినాలు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ నాగరత్నమ్మ, ఏపీడీ శ్రీలక్ష్మి, డీబీఓ అంబటి సురేష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఏపీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్‌పై దాడి



దాడిలో తీవ్రంగా గాయపడిన వలంటీర్ శివ

పులివెందుల : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో గల రాజీవ్‌కాలనీకి చెందిన వలంటీర్ శివపై గురువారం సాయంత్రం దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. పార్నపల్లె రోడ్డులో వలంటీర్ శివ నివాసం ఉండేవాడు. అతని ఇంటి పక్కనే లక్షుమయ్య అనే వ్యక్తి కాపురం ఉంటూ మేకలు మేపుకునేవాడు. గురువారం సాయంత్రం లక్షుమయ్యకు చెందిన మేకలు శివ ఇంటి ముందు ఉన్న చెట్ల ఆకులను తింటూ పాడు చేస్తున్నాయని శివ లక్షుమయ్యతో వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో శివపై కోపోద్రిక్తుడైన లక్షుమయ్య తన వద్ద ఉన్న దోటి కొడవలితో దాడి చేశాడు. దీంతో శివ తలకు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ శివకు ప్రథమ చికిత్స నిమిత్తం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైన్స్ అవార్డుల రద్దు దేశ ప్రగతికి అడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

కడప కల్చరల్ : సైన్స్ అవార్డులను రద్దు చేయడం దేశ ప్రగతిని అడ్డుకోవడమేనని, శాస్త్ర పురోగతిని భంగ పరిచినట్లని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి తీసుకున్న నిర్ణయం సరికాదని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యువ శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ హోదా గల శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు ఇవ్వడమేనని, ఇలా ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. వాటిని రద్దు చేయడం ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకుని తాను చెప్పినట్లు వినే కీలు బొమ్మలను చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన అని విమర్శించారు. బడ్జెట్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాలకు నిధుల కోతను గమనిస్తూనే ఉన్నామని, ఇప్పటికే భారత ప్రభుత్వం డిపార్టుమెంటు ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నడుస్తున్న విజ్ఞాన్‌ప్రసార్ సంస్థను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షులు బాల బయన్న మాట్లాడుతూ పాఠ్యాంశాలలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పీరియాడిక్ టేబుల్ లాంటి అంశాలను తొలగించడం, విద్యార్థులకు శాస్త్రీయ అంశాలను తెలియపరచకూడదనే భావన పాలకుల్లో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

జింకను కాపాడిన యువకులు



నందలూరు (రాజంపేట): దాహార్తిని తీర్చుకునేందుకు నందలూరు కన్యకల చెరువులోకి వచ్చిన జింకను కుక్కలు తరుముకున్నాయి. ఈ క్రమంలో ఆ జింక చెరువుకుంటలో పడిపోయింది. అటుగా రైలులో ప్రయాణిస్తున్న ఒకరు గమనించి స్థానిక యువకులకు సమాచారం ఇచ్చారు. కుక్కల దాడిలో గాయపడిన జింకను నీటి నుంచి వారు బయటికి తీశారు. అక్కి హర్షవర్ధన్, జ్యోతిసాయి, శివా, అరవింద్, రంజిత్ మరికొంతమంది యువకులు వన్యప్రాణిని కాపాడినందుకు పలువురు అభినందించారు. అటవీశాఖ అధికారులకు జింకను అప్పగించారు. జింకకు వైద్యం అందించగా క్షేమంగా ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

కంకర ఫ్యాక్టరీలో బ్లాస్టింగ్

– కార్మికుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన కార్మికుడు రమేష్

కురబలకోట : బతుకు దెరువు కోసం ఒరిస్సా రాష్ట్రం నుండి పొట్ట చేతపట్టుకుని వచ్చిన కార్మికుడు కంకర ఫ్యాక్టరీలో బ్లాస్టింగ్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. కురబలకోట మండలంలోని సర్కారుతోపు వద్ద కంకర ఫ్యాక్టరీ నడుస్తోంది. కంకర కోసం గురువారం పక్కనున్న గుట్టలో బ్లాస్టింగ్ చేశారు. ఈ సంఘటనలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు రమేష్ (38) తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన సహచరులు అతన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు

స్పందించని ఖాతాదారుడిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో 42/2 డివిజన్ సచివాలయం పరిధిలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న శైలజ బ్యాంక్ ఖాతాలో వేయాల్సిన డబ్బులు రూ. 3.71 లక్షలను, మరొకరి బ్యాంక్ ఖాతాలోకి పడ్డాయి. బ్యాంక్ ఉద్యోగి తప్పిదం వలన ఈ డబ్బులు మరొకరి ఖాతాలో పడిన విషయాన్ని గుర్తించి సదరు ఖాతాదారుడిని బాధితురాలు ఫోన్ చేసి అడిగారు. సరైన సమాధానం రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు ఖాతాదారుడు స్పందించక పోవడంతో మహిళా పోలీస్ శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఎస్ఐ రామకృష్ణ తెలియజేశారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో చెలరేగిన మంటలు

పెనగలూరు : కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం తెల్లవారుజామున గదులలో మంటలు చెలరేగాయి. కింద ఫ్లోర్ ఒక గదిలో, పై ఫ్లోర్‌లో మరొక గదిలో మంటలు చెలరేగాయి. ఎదురు గదిలో పదోతరగతి విద్యార్థినులు స్టడీ అవర్స్‌లో ఉండగా వాసన రావడంతో నిద్రిస్తున్న విద్యార్థులను నిద్ర లేపారు. అప్పుడు మంటలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. అలమరలోని విద్యార్థినుల దుస్తులకు మంటలు అంటుకోవడంతో గది అంతా పొగతో నిండిపోయింది. ఈ సమాచారం ప్రిన్సిపాల్‌కు చేరవేయడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అని విద్యుత్‌ను నిలిపివేశారు. తెల్లవారి చూడగా విద్యుత్ వల్ల మంటలు చెలరేగలేదని విద్యుత్ అధికారులు నిర్ధారించారు. ఈ మంటలు చెలరేగిన విషయంపై పలు అనుమానాలు వ్యక్తం కావడంతో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు కారణమైన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుచరిత రెండు రోజుల క్రితం పాఠశాల బాధ్యతలు తీసుకున్నారు.

119 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : ఎస్ఈబీ అధికారులు గురువారం విస్తృతంగా జరిపిన తనిఖీల్లో మూడు నేరాల్లో ఐదుగురిని అరెస్ట్ చేయడంతో పాటుగా, 119 లీటర్ల సారా, 44 కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, ఒక ఆటో, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ నారమాకులతండాకు చెందిన మల్లేశ్వర్‌నాయక్ 15 లీటర్ల సారాను ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా అరెస్టుచేశారు. పట్టణంలోని బాబూకాలనీకి చెందిన భార్యాభర్తలు ధర్మానాయక్(54), భారాతమ్మ(46) ఇంటిలో 44 కర్నాటక మద్యం ప్యాకెట్లు, 4 లీటర్ల నాటుసారా కలిగిఉండటాన్ని గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే పట్టణంలోని మధుసూధన థియేటర్ వద్ద శివాలయం మలుపులో నారమాకులతండా నుంచి ఆటోలో పట్టణానికి తరలిస్తున్న 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నారమాకులతండాకు చెందిన మునిస్వామినాయక్(23), నక్కలదిన్నె తండాకు చెందిన మారెప్పనాయక్(35)ను అరెస్ట్ చేయడంతో పాటుగా ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో మహిళ అస్వస్థతకు గురైన సంఘటన గురువారం ములకలచెరువు మండలంలో జరిగింది. పాత ములకలచెరువుకు చెందిన లక్ష్మీదేవి (38) టమాటా పంటలో కలుపు తీస్తుండగా పాము కాటు వేసింది. ఆమెను ఆస్పత్రికి తరలించారు.

ఘరానా మోసగాడు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : చీటీల వ్యాపారం చేసి ప్రజలకు శఠగోపం పెట్టిన ఘరానా మోసగాడిని పోరుమామిళ్ళ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. వివరాలను స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ వెల్లడించారు. కాశినాయన మండలం కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన లక్ష్మిశెట్టి చిన్న ఓబులేసు గత కొన్నేళ్లుగా పోరుమామిళ్ల పట్టణంలోని రెడ్డినగర్ 4వ లైన్‌లో నివసిస్తున్నాడు. ఇతను చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో నమ్మకంగా ఉంటూ అనధికారికంగా చీటీల వ్యాపారం ప్రారంభించాడు. అధిక శాతం మందితో చీటీలు వేయించుకుని చీటీలు పాడుకున్న వారికి డబ్బులు చెల్లించకుండా పరారయ్యాడు. ఈ మేరకు బాధితుల్లో ఒకరైన పోరుమామిళ్లకు చెందిన రఘురాములు పోరుమామిళ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ నెల 19న కేసు నమోదు చేసుకున్న పోలీసులు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పోరుమామిళ్ల–మైదుకూరు రహదారిలోని గురప్పగారిపల్లె వద్ద ఉన్న ఓబులేసును సీఐ సురేష్‌రెడ్డి, సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. నిందితుడితో పాటు ఇన్నోవా కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. పోరుమామిళ్ల, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 82 మంది బాధితుల నుండి రూ.4,47,45,263లు వసూలు చేసుకుని ప్రజలకు చెల్లించకుండా తన జల్సాలకు వాడుకున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. అంతేకాకుండా ప్రజలను మోసం చేసి వచ్చిన డబ్బుతో రెడ్డినగర్ 4వ వీధిలో రూ.1.50 కోట్ల వ్యయంతో ఓ ఇంటిని నిర్మించాడు. రెడ్డినగర్ 3వ లైన్‌లో 6 సెంట్ల స్థలం కొనుగోలు చేయడంతో పాటు అదే ఏరియాలోని 2వ లైన్‌లో 9 సెంట్ల స్థలంలో రెండు ఇళ్ళు నిర్మించి అమ్మినట్లు తేలిందన్నారు. అలాగే ఒక ఇన్నోవా కారును కూడా కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. నిందితుడి పేరు మీద ఇంకా ఏవైనా ఆస్తులు ఉన్నాయా అనే విషయంపై బద్వేలు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంతో పాటు పోరుమామిళ్ల, కాశినాయన తహసీల్దారు కార్యాలయాల నుండి వివరాలు కోరామన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- ట్యాంకర్‌ను ఓవర్ టేక్ చేయబోతుండగా అదుపుతప్పిన మరో ట్యాంకర్
- రోడ్డు పక్కనున్న ఇన్నోవాను ఢీ కొట్టిన వైనం



ఘటనా స్థలంలో బురదలో ఇరుక్కుపోయిన ట్యాంకర్

జమ్మలమడుగు : జమ్మలమడుగు–ప్రొద్దుటూరు రహదారిలో పెను ప్రమాదం తప్పింది. ఓవర్ స్పీడ్‌తో మూడు ఫ్లయాష్ ట్యాంకర్లు రావడం.. అందులో ఓ ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేక పక్కనే ఉన్న ఇన్నోవా, స్కూటర్‌లకు ఢీకొట్టాడు. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.

గురువారం ఉదయం ప్రొద్దుటూరు వైపు నుంచి ఫ్లయాస్ ట్యాంకర్లు జమ్మలమడుగు మీదుగా వెళుతున్నాయి. ఒక ట్యాంకర్‌ను మరో ట్యాంకర్ ఓవర్ టేక్ చేయబోయింది. అయితే వెనుకవైపు నుంచి మరో ట్యాంకర్ డ్రైవర్ ఈ రెండింటినీ ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నం చేస్తూ వచ్చాడు. ఇలా గొరిగెనూరు దాటి బైపాస్ రోడ్డు సమీపంలోఉన్న పాలకోవ దుకాణం వరకు వచ్చారు. అయితే ట్యాంకర్ వెనుకవైపు భాగం తగలడంతో వాహనాన్ని అదుపు చేసే క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న స్కూటర్, ఇన్నోవా వాహనాలను మూడో ట్యాంకర్ డ్రైవర్ ఢీకొట్టాడు. దీంతో స్కూటర్ తుక్కు తుక్కు అయిపోయి ఇన్నోవా వాహనం పూర్తిగా దెబ్బతింది.

ఈ ప్రమాదం జరిగిన సమయంలో పాలకోవ దుకాణంలో దాదాపు 8 మంది పనులు చేసుకుంటున్నారు. రాత్రి వర్షం పడటంతో ఈ ప్రాంతం కొంత బురదమయం అయింది. అంతేకాకుండా ప్రొద్దుటూరు ప్రజలకు తాగునీటి కోసం తవ్విన పైప్ లైన్ సైతం ఈ దుకాణం సమీపం నుంచి వెళుతుంది. రెండు ఫ్లయాస్ ట్యాంకర్‌లను ఓవర్ టేక్ చేయబోయిన మూడో ట్యాంకర్ ఇన్నోవా, స్కూటర్‌లకు ఢీకొట్టి పాలకోవ దుకాణం సమీపంలో ఉన్న బురదలో పడి ఇరుక్కుపోయింది. దీంతో పాలకోవ దుకాణంలో పనిచేసే కార్మికులు భయందోళనతో పరుగులు తీశారు. ప్రమాదానికి గురైన ట్యాంకర్‌ను స్థానిక అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారీ కావడంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ సదాశివయ్యపేర్కొన్నారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయం



హోంగార్డు సతీమణి షేక్ షమీమ్‌కు రూ. 38 లక్షలకు సంబంధించిన రెండు చెక్కులను అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

చెక్కులను అందజేసిన ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలోని పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులను నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు ఎస్. బాబా ఫక్రుద్దీన్ కుటుంబానికి రూ. 30 లక్షలు ప్రమాద బీమా మొత్తాన్ని, కుమార్తె పేరు మీద మరో రూ. 8 లక్షల ఫిక్సెడ్ డిపాజిట్‌ను (మొత్తం రూ. 38 లక్షలు) చెక్కుల రూపంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ జిల్లాపోలీసు కార్యాలయంలో గురువారం హోంగార్డు సతీమణి షేక్ షమీమ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డు కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఆర్ఐ సోమశేఖర్ నాయక్, యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ....

ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏ.ఆర్ కానిస్టేబుల్ బి. రామకృష్ణ కుటుంబానికి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2.75 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఇందులో వితరణ నిధి నుంచి రూ. 2లక్షలు, రూ. 50 వేల విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ. 25 వేలు మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. బి. రామకృష్ణ సతీమణి బి. నాగలక్ష్మికి జిల్లా ఎస్పీ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్థికసాయంను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, వారి కుటుంబయోగాక్షేమాలను విచారించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, డిపిఓ ఏఓ జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, జాయింట్ సెక్రటరీ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాపై అవగాహన



వైఎస్సార్ పశు బీమా గురించి వివరిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్ పశు బీమా పథకంపై గురువారం మండలంలోని పలుగురాళ్లపల్లెలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ మాట్లాడుతూ పాడి పశువులు, గొర్రెల పెంపకందారులకు వైఎస్సార్ పశుబీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. బీమా ప్రీమియం చెల్లించేందుకు రైతు భరోసా కేంద్రంలోని పశుసంవర్ధక సహాయకుడిని కానీ, పశువైద్యుడిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ కడప డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వెంకటరమణయ్య, బి.మఠం సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఇన్సూరెన్స్ మీడియటర్ కార్తికేయరెడ్డి, పలుగురాళ్లపల్లె సర్పంచ్ మార్తమ్మ భర్త జయన్న, పెద్దిరాజుపల్లె, పలుగురాళ్లపల్లె పశువైద్యాధికారులు డాక్టర్ నిత్యానంద్, బి.కోడూరు, ప్రభాలవీడు డాక్టర్లు భరద్వాజ్, లక్ష్మీనరసయ్య, సచివాలయ సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

మంటపంపల్లెలో ఇరు వర్గాల ఘర్షణ

ఇద్దరికి తీవ్రగాయాలు





ఘర్షణలో తీవ్రంగా గాయపడిన అనుపల్లి మహేష్, ముక్కర రాంప్రసాద్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లె గ్రామంలోని అరుంధతి కాలనీలో గురువారం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి, ఇద్దరికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు అయ్యాయని ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మంటపంపల్లెలో గురువారం గంగమ్మ జాతర సందర్భంగా జంతు బలి జరిగింది. ఈ బలిలో మంటపంపల్లె అరుంధతి కాలనీకి చెందిన వారికి మేటీల పరంగా వాగ్వాదం జరిగి పెద్ద ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో రెండు వర్గాల లో ఒక వర్గం నుంచి 10 మంది, మరొక వర్గం నుంచి 10 మంది కలిసి కొట్టుకోవడంతో అందులో ఒక వర్గం వారైన ముక్కర రాంప్రసాద్(29), అనుపలి మహేష్(26) అనే యువకుల తలలకు తీవ్రమైన రక్త గాయాలు అయ్యాయి. మరొక వర్గంలో సుబ్బనరసయ్య(65) అనే వృద్ధుడికి స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు సంఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణను అదుపుచేసి, తీవ్రగాయాలు అయిన వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలివ్వగా, స్వల్ప గాయాలైన వృద్ధుడిని స్థానిక పీహెచ్‌సీలో చేర్పించారు. ఘర్షణకు కారకులైన ఇరువర్గాలకు సంబంధించిన మిగిలిన వారు పరారీలో ఉన్నారన్నారు.